క్లుప్తంగా

బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ


అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సీడీపీవో లక్ష్మీదేవి

గూడెంకొత్తవీధి: కిశోర బాలికలు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని గూడెంకొత్తవీధి ఐసీడీఎస్ సీడీపీవో లక్ష్మీదేవి అన్నారు. కిశోర వికాసం వేసవి శిబిరాల్లో భాగంగా మంగళవారం మండలంలోని పాములాయి. పీకే గూడెం గ్రామాల్లో కిశోర బాలికలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్లు వలసమ్మ, మోహిని రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

20న సీఐటీయూ నేతల సమ్మె

కొయ్యూరు: మండలంలోని ఈనెల 20 జరగనున్న సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకుడు వై.అప్పలనాయుడు కోరారు. ఆయన మంగళవారం కొయ్యూరులో ఉపాధి కూలీల సమస్యలపై మాట్లాడారు. ఉపాధి కూలీని రోజుకు రూ.600లకు పెంచాలన్నారు. అనేక సమస్యలపై జరుగనున్న సమ్మెను విజయవంతం చేసేందుకు ఉపాధి కూలీలు పాల్గొవాలని ఆయన కోరారు.

యూబీఐ మేనేజర్‌గా ప్రసాద్ బాధ్యతల స్వీకరణ


ప్రసాద్

అడ్డతీగల: అడ్డతీగల యూనియన్ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్‌గా బి.ఎస్. సీహెచ్.ప్రసాద్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలు యూబీఐ బ్రాంచి నుంచి బదిలీపై ప్రసాద్ అడ్డతీగల వచ్చారు. ఇప్పటివరకూ ఇక్కడ బీఎంగా చేసిన రవికిరణ్ రాజవొమ్మంగి బ్రాంచికి బదిలీ అయ్యారు. నిత్యం ఖాతాదారులకు అందుబాటులో ఉండి బ్యాంకు సేవలను విస్తృతం చేస్తామని నూతన బ్రాంచి మేనేజర్ ప్రసాద్ తెలిపారు.

రైతుల వివరాల నమోదు


రైతుల వివరాలను నమోదు చేయిస్తున్న ఏవో మధుసూధనరావు

గూడెంకొత్తవీధి: ప్రభుత్వం కల్పిస్తున్న అన్నదాత సుఖీభవ పథకంలో భాగంగా రైతులు తమ పేర్లు, వివరాలను ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి మధుసూధనరావు అన్నారు.మండలంలోని దామనాపల్లి పంచాయతీ మాడెంలో మంగళవారం రైతులతో అన్నదాత సుఖీభవ పథకంలో పేర్లను నమోదు చేయించారు. ఎంపీఈఓ జోసెప్, వార్డు సభ్యులు కృష్ణ, సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రీ ప్రైమరీ విద్యతోనే పిల్లలకు పురోగతి


పిల్లల తల్లిదండ్రులకు నైపుణ్య పత్రాలను అందజేస్తున్న సర్పంచ్ పిట్టా రామారావు

వి.ఆర్.పురం: ప్రీ ప్రైమరీ విద్యతోనే పిల్లలకు పురోగతి ఉంటుందని ఐసీడీఎస్ సీడీపీవో నాగలక్ష్మి అన్నారు. మండలంలోని చిన్నమట్టపల్లి ఎంపీపీఎస్‌లో సంసిద్ధత ఉత్సవ్‌ను మంగళవారం నిర్వహించారు. ఇందులో భాగంగా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. పిల్లల ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. స్థానిక సర్పంచ్ పిట్టా రామారావు, ఎంఈవో చిచ్చడి బాబూరావు, హెచ్ఎం నాగేశ్వరావు, ఐటీసీ ప్రథమ జిల్లా కో–ఆర్డినేటర్ పవన్, సూపర్‌వైజర్ పద్మావతి పాల్గొన్నారు. అంగన్‌వాడీ కేంద్రం ద్వారా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. ప్రీ ప్రైమరీ చదివిన పిల్లల నైపుణ్య పత్రాలను వారి తల్లిదండ్రులకు అందజేశారు. తల్లిదండ్రులు, అధికారులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

16న మండల సమావేశం

డుంబ్రిగుడ, అనంతగిరి(అరకులోయ టౌన్): అనంతగిరి మండల సమావేశం ఈనెల 16న నిర్వహిస్తున్నట్టు అనంతగిరి ఎంపీడీవో కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ శెట్టి నీలవేణి ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 10గంటలకు నిర్వహించనున్న ఈ సమావేశంలో మండలంలోని అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

ఆశల సాగు

- విస్తారంగా వేరుశనగ సాగు
- మార్కెట్‌లో గిరాకీ
- సంతల్లో గిట్టుబాటు ధరలు


పెద్దపేటలో వేరుశనగ పంట

ముంచంగిపుట్టు: మత్స్యగెడ్డ పరివాహిక ప్రాంతాల్లో గిరిజనులు విస్తారంగా వేరుశనగ పంట సాగును చేస్తున్నారు. పంటకు వాతావరణం సైతం అనుకూలించడంతో పనుల్లో గిరిజన రైతులు నిమగ్నమయ్యారు. ముంచంగిపుట్టు మండలంలో ప్రతి ఏడాది ఏప్రిల్, మే నెలల్లో దారెల, సుజనకోట, పెదగూడ, వనుగుమ్మ, పనసపుట్టు, మాకవరం, దొడిపుట్టు పంచాయతీల్లో వందల ఎకరాల్లో గిరిజనులు వేరుశనగ పంటను వేస్తారు. ఒక్క ఏడాదిలో గిరిజన రైతులు రెండు దఫాలు వేరుశనగ పంటను పండిస్తున్నారు. దీనికి తోడు వర్షాకాలంలోనే కాకుండా ఎండాకాలంలోనూ చెదురు ముదురుగా వర్షాలు కురవడంతో రైతులకు అన్ని విధాలుగా వాతావరణం కలిసొచ్చింది. పంట సాగుకు నీటి అవసరాలు తీరాయి. వర్షాలు పడని పక్షనా మత్స్యగెడ్డ నీటిని వాడుకుంటూ పంటను పండిస్తున్నారు. ప్రస్తుతం మత్స్యగెడ్డ పరివాహక గిరిజన గ్రామాల్లో గిరిజనులు వేరుశనగ పంటను సాగు చేసే పనుల్లో నిమగ్నమై ఉన్నారు. ఇంటిల్లిపాది వేరుశనగ పంట పొలాల్లోనే ఉంటూ ఎరువులు జల్లుతూ, నీటిని పెడుతూ పనులు చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో ఇప్పటికే పంట చేతికి రావడంతో వేరుశనగను ఉడకబెట్టి పనులు చేస్తున్నారు. ఉడికిన వాటిని బాగా ఎండబెట్టిన అనంతరం వారపు సంతలకు తరలిస్తున్నారు. సంతల్లో గ్లాసు రూ.20 రూపాయిలు నుంచి రూ.50 వరకు గిరి రైతులు అమ్మకాలు చేపడుతున్నారు. దీంతో పాటు పచ్చి వేరుశనగ సైతం బస్తాల లెక్క అమ్మకాలు చేస్తున్నారు. వీటిని కొనుగోలు చేసేందుకు మైదాన ప్రాంతంతో పాటు ఒడిశా రాష్ట్రం నుంచి వ్యాపారులు వచ్చి అధికంగా కొనుగోలు చేస్తున్నారు. వేరుశనగను లారీలు, వ్యానులలో తరలిస్తున్నారు. మార్కెట్‌లో ఏజెన్సీ వేరశనగకు డిమాండ్ ఉంది. మంచి ధరలు వస్తుండడంతో రైతులు ఏటా మరింత ఎక్కువ విస్తీర్ణంలో పండిస్తున్నారు. అధిక దిగుబడి వస్తే ఆర్థిక ఇబ్బందుల నుంచి వేరుశనగ ఆదుకుంటుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

గిట్టుబాటు ధరలు

మత్స్యగెడ్డ సమీప గ్రామం కావడం వేరుశనగ పంటను ఏడాదిలో రెండు సార్లు సాగు చేస్తున్నాం. ఆర్థిక ఇబ్బందులతో అవస్థలు పడుతున్న మాకు వేరుశనగ పంట ఆదుకుంటూ వస్తుంది. ప్రతి వరి పంట దిగుబడితో పాటు లాభాలు బాగా వస్తున్నాయి. గిట్టుబాటు ధరలు ఉన్నాయి. మండలంలో జరిగే వారపు సంతకు తీసుకువెళ్లి అమ్మకాలు చేస్తున్నాం.

– కె.రామారావు, రైతు, పెద్దపేట గ్రామం, ముంచంగిపుట్టు మండలం


మాలిగుడలో క్యాబేజీ సాగు

అంతర పంటలతో అధిక ఆదాయం

గూడెంకొత్తవీధి: గూడెంకొత్తవీధి మండలంలోని మాలిగుడ గ్రామంలో కొందరు గిరిజన రైతులు నీటి సదుపాయం ఉన్న చోట ఏడాది పొడవునా అన్ని రకాల కాయగూరల, ఆకుకూరలు వాణిజ్యపరంగా సాగు చేస్తున్నారు. మాలీతెగకు చెందిన గిరిజన రైతులు అన్ని రకాల పంటలు పండిస్తున్నారు. ఈ గ్రామంలో సుమారు 50 మంది గిరిజన రైతులున్నారు. సుమారు 60 ఎకరాల్లో అన్ని రకాల ఆకుకూరలు, కాయగూరలు పండిస్తూ ఆదాయం పొందుతున్నారు. ప్రస్తుతం క్యాబేజీ, క్యాలీఫ్లవర్, వంగ, టమాటా, ముల్లంగి, వంటి కాయగూరలను పండిస్తున్నారు. వీటితో పాటు తోటకూర, పాలకూర, చుక్కకూర, గోంగూర వంటి ఆకుకూరలను సాగు చేస్తున్నారు. మన్యంలో పండించే ఆకు కూరలు, కాయగూరలకు మైదాన ప్రాంతాల్లో మంచి గిరాకీ ఉంది. కాయగూరలకు వేసవిలో డిమాండ్ ఉండడంతో గిట్టుబాటు ధరలు లభిస్తున్నాయని గిరిజన రైతులు చెబుతున్నారు. పండించిన కాయగూరలను వారపు సంతలకు తీసుకువెళ్లి విక్రయిస్తున్నారు. ఇంటిల్లిపాదీ కాయగూరల సాగులో నిమమవుతున్నారు. దీంతో తమకు కూలీ ఖర్చులు తగ్గి ఆదా అవుతున్నాయని రైతులు చెబుతున్నారు.

జీవో నంబర్–3 పునరుద్ధరించాలి

డుంబ్రిగుడ(అరకులోయ టౌన్): ఏజెన్సీ ప్రాంతంలో వందశాతం రిజర్వేషన్లు అమలుచేస్తేనే గిరిజనులకు న్యాయం జరుగుతుందని, చంద్రబాబు ఎన్నికల మేనిఫెస్టులో హామీ ప్రకారం జీవో నంబర్ 3ను చట్టబద్ధత వెంటనే చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రామారావు, సురేంద్ర డిమాండ్ చేశారు. డీఎస్సీ దరఖాస్తు గడువు మే 15న ముగుస్తున్నందున్న ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకొని డీఎస్సీ నుంచి ఏజెన్సీ పోస్టులు మినహాయించాలన్నారు. గిరిజన అభ్యర్థుల కోసం ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు.

రంపచోడవరం : జీవో నంబర్ 3 పునరుద్ధరణకు కూటమి ప్రభుత్వం తక్షణమే ఉత్వర్వులు విడుదల చేయాలని, ట్రైబల్ అడ్వైజరీ కమిటీని ఏర్పాటు చేయాలని జేఏసీ శ్రీనివాసు, జగన్నాథ రెడ్డి, రాంబాబు, కృష్ణారెడ్డి, నాయకులు చెప్పారు. వారు మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు అనుగుణంగా జీవో నెంబర్–3 పునరుద్ధరణ కల్పించాలన్నారు. ఏజెన్సీలో ప్రత్యేక డీఎస్సీ ప్రకటించి గిరిజన అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరారు. నాయకులు అగ్గిదొర, రామన్నదొర, ప్రసాద్, శుభకృష్ణ, రమణారెడ్డి,శ్రీనుబాబు, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

పెదబయలు: పెదబయలు ఏపీ గురుకుల రెసిడెన్షియల్ బాలుర కళాశాలలో ఇంటర్‌లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ కె.ఈశ్వరమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరంలో ఇంటర్ ప్రవేశానికి కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఇసీ, ఎంఈసీ, ఎఅండ్‌టీ గ్రూపుల్లో ప్రవేశాలకు ఏపీ గురుకులం వెబ్‌సైట్ ఈ నెల 18 తేదిలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. టెస్ట్‌లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు అర్హులని దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఏకలవ్య పాఠశాలల్లో నూరుశాతం ఉత్తీర్ణత

గూడెంకొత్తవీధి: గూడెంకొత్తవీధిలోని ఏకలవ్య మోడల్ రెషిడెన్షియల్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ఈ ఏడాది సీబీఎస్‌సీ సిలబస్‌లో పది, ఇంటర్ ఫలితాల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించినట్టు పాఠశాల ప్రిన్సిపాల్ రమణరావు తెలిపారు. ఇంటర్‌లో 74 మంది పదో తరగతి 60 మంది హాజరు కాగా, అందరూ ఉత్తీర్ణత సాధించినట్టు ఆయన తెలిపారు.

డుంబ్రిగుడ: మండలంలోని ఉన్న ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాలలో సీబీఎస్‌సీ బోర్డు నిర్వహించిన ఇంటర్, టెన్త్ పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించినట్టు పాఠశాల ప్రిన్సిపాల్ సుమన్‌కుమార్ సింగ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ పరీక్షలు రాసిన 75 మంది విద్యార్థుల్లో 75 మంది, సీబీఎస్‌సీ పదో తరగతిలో 52 మందికి 52 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్టు పేర్కొన్నారు. మండల పరిధిలో సీబీఎస్‌సీ సిలబస్‌లో ఇంటర్ సెకండియర్ ఫలితాల్లో కిల్లో లైచోన్ 383 మార్కులు(ఎంపీసీ), పి.షర్మిల 412 మార్కులు(బైపీసీ), కొర్ర దేవి 377 మార్కులు (హెచ్ఈసీ)లలో మండల టాపర్లుగా నిలిచినట్టు తెలిపారు. పదో తరగతిలో మొదటి స్థానంలో ఎల్.బి.స్వప్నిక (401 మార్కులు), రెండవ స్థానంలో కొర్ర నిర్మల (375 మార్కులు), మూడవ స్థానంలో ఓలేసు ఫిలిఫ్‌చంద్ (371 మార్కులు)తో ఉత్తీర్ణులైనట్టు పేర్కొన్నారు. విద్యార్థులందరికీ ప్రిన్సిపాల్ అభినందనలు తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ మురుగేష్ పాల్గొన్నారు.

అంబరాన్నంటిన మోదకొండమ్మ తల్లి ఉత్సవాలు

- అంగరంగ వైభవంగా ముగిసిన వేడుకలు
- అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు
- వేలాది మందికి ఉచిత భోజనాలు
- పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు ప్రత్యేక శ్రద్ధ
- భక్తజనంతో కిక్కిరిసిన పట్టణం
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు


మోదకొండమ్మతల్లి ఉత్సవ విగ్రహం మోస్తున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు,శివరత్నం దంపతులు


మోదమ్మకు పూజలు చేస్తున్న గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణి


మోదమ్మ ఉత్సవ విగ్రహాన్ని మోస్తున్న పోలవరం ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి అభిషేక్


థింసా నృత్యం చేస్తున్న గిరిజనులు


మోదమ్మ ఉత్సవ విగ్రహాన్ని మోస్తున్న సబ్‌కలెక్టర్ సౌర్యమన్‌పటేల్


ఘటాల ఊరేగింపులో భక్తులు


డప్పు కొడుతూ సందడి చేస్తున్న పోలవరం ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి వి.అభిషేక్


పాడేరు మెయిన్‌రోడ్డులో ఊరేగింపు సంబరం


అమ్మవారి ఆలయం వద్ద భక్తులు


తరలివచ్చిన భక్తులు


బాణసంచా వెలుగులు


తప్పెటగుళ్ల నృత్యాలు


కోలాటం నృత్యాలు


బిందెలతో థింసా నృత్యం చేస్తున్న గిరిజన మహిళలు


గిరిజన కళాకారులను అభినందిస్తున్న జేసీ అభిషేక్‌గౌడ,పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ అభిషేక్, సబ్ కలెక్టర్ సౌర్యమన్‌పటేల్‌లు

సాక్షి,పాడేరు: మోదకొండమ్మతల్లి జాతర ఉత్సవాలు మంగళవారంతో ఘనంగా ముగిశాయి. అంగరంగ వైభవంగా మూడు రోజులుగా జరిగిన వేడుకలకు వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచి అమ్మవారిని దర్శించుకొని, మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి ఉత్సవ విగ్రహ ఊరేగింపు కనులపండువగా జరిగింది. స్థానికులతో పాటు పరిసర ప్రాంతాలు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌ఘడ్ తదితర రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులతో పాడేరు పట్టణం కిక్కిరిసింది.

పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఉత్సవాలపై ప్రత్యేక పర్యవేక్షణ

మోదకొండమ్మ తల్లి జాతర ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి ఆలయ ప్రాంగణంలో భక్తులకు చేపట్టిన ఉచిత భోజనాల పంపిణీ విజయవంతమైంది.ఉత్సవ కమిటీ అధ్యక్షుడు,పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు భక్తుల ఉచిత భోజనాలపై ప్రత్యేక శ్రద్ధ చూపి వేలాది మంది భక్తుల ఆకలితీర్చారు. పలు వర్గాల భక్తుల సహకారంతో పాటు ఆలయ కమిటీ నిధులతో ఉచిత భోజనాల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు చర్యలు తీసుకున్నారు. ఉదయం, రాత్రి సమయాల్లో భోజనాల పంపిణీని ఎమ్మెల్యేతో పాటు ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబునాయుడు, ఇతర ప్రతినిధులు పర్యవేక్షిస్తున్నారు. ఉత్సవాల చివరిరోజు మంగళవారం అనుపోత్సవంతో భక్తులు భారీగా మోదకొండమ్మతల్లిని దర్శించుకోవడంతో వారందరికి ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు భోజనాలు వడ్డించారు.

ముగిసిన గిరిజన నృత్యాలు

స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో ఐటీడీఏ మూడు రోజులుగా నిర్వహిస్తున్న గిరిజన నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు మంగళవారం రాత్రితో విజయవంతంగా ముగిశాయి.చివరిరోజు గిరిజన నృత్యాలు హోరెత్తాయి. గిరిజన కళాకారులు, విద్యార్థులు, నిర్వాహకులను జాయింట్ కలెక్టర్ అభిషేక్‌గౌడ, పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ అభిషేక్, సబ్‌కలెక్టర్ సౌర్యమన్‌పటేల్‌లు ఇతర అధికారులంతా అభినందించి జ్ఞాపికలు అందజేశారు.

పిడుగుపాటుకు రైతు మృతి


ఘటన స్థలంలో మృతి చెందిన దుక్కి పశువు


రైతు సమర్ది డొంబు మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

డుంబ్రిగుడ (అరకులోయ టౌన్): అరకులోయ మండలం మాడగడ పంచాయతీ మంజగుడ గ్రామానికి చెందిన గిరిజన రైతు సమర్ది డొంబు (58) పిడుగుపాటుకు గురై మృతి చెందాడు. మంగళవారం పశువులను మేతకు తీసుకువెళ్లాడు. అదే సమయంలో పిడుగు పడటంతో అతనితో పాటు దుక్కి పశువు మృతి చెందిందని సర్పంచ్ పాడిబారికి జ్యోతి తెలిపారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఆమె కోరారు.

బెట్టింగ్ ప్రధాన నిందితుడు చందు అరెస్ట్

విశాఖ సిటీ: ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్ మోసాలకు పాల్పడుతున్న ప్రధాన నిందితుడు చందుని పోలీసులు చాకచక్యంగా అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బెట్టింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్న నిందితుడిని పోలీసులు ఇటీవల పట్టుకొని విచారించారు.

అతడి నుంచి బెట్టింగ్ ప్రధాన నిందితుడి వివరాలను సేకరించారు. పరారీలో ఉన్న కాకినాడకు చెందిన ప్రధాన నిందితుడు సిహెచ్.వెంకటమణి చందుని అదే జిల్లాలో పట్టుకున్నారు. బెట్టింగ్ కోసం వినియోగిస్తున్న నాలుగు స్మార్ట్‌ఫోన్లు, ఒక కీప్యాడ్ మొబైల్‌ను నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్నారు. చందును అరెస్టు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించారు.

ఈ కేసులో మరింత మంది బెట్టింగ్ రాయుళ్లతో పాటు బెట్టింగ్ ఆడుతున్న వారిపై పోలీసులు నిఘా పెట్టారు. వారి కోసం ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నారు.

సమీకృత పశుదాణాతో సత్ఫలితాలు


కె.వెంకటాపురంలో పశుదాణా ప్యాకెట్లు అందిస్తున్న అధికారులు

కోటవురట్ల: వేసవిలో పశుగ్రాసం కొరత రాకుండా సమీకృత దాణా ఉపయోగపడుతుందని పశువైద్యాధికారి డాక్టరు బాబూరావు పడాల్ తెలిపారు. కె.వెంకటాపురంలోని పశువైద్య శాల వద్ద సమీకృత పశుదాణాను మంగళవారం పంపిణీ చేశారు. బాబూరావు పడాల్ మాట్లాడుతూ పశు సంవర్థక శాఖ ద్వారా సమీకృత మిశ్రమ దాణా 50 కిలో బ్యాగు రాయితీ పోను రూ.550కు అందిస్తున్నట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ యలమంచిలి ప్రకాష్, రైతులు పైల నాని, తిరుమలరావు, పశు సంవర్థక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం ఎంతో మేలు

అచ్యుతాపురం: మండలంలోని కొండకర్లలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తున్న ఆరుగురు రైతులను మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. సన్మాన గ్రహీత భాను ప్రకాశ్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయాన్ని ఆచరించడం వల్ల భూసారం పెరుగుతుందని, ఖర్చులు తగ్గుతాయని చెప్పారు. ఈ పద్ధతిలో దిగుబడి వచ్చిన ఉత్పత్తుల వల్ల ఎటువంటి దుష్ప్రభావాలు ఉండవని తెలిపారు. ఎంఏవో శేఖర్ గోవింద్, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.